క్లుప్తంగా

వేసవిలో బాల్ బ్యాడ్మింటన్ శిబిరం



బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నంది పైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో పిల్లల కోసం బాల్ బ్యాడ్మింటన్ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు వంశీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్పీవైరెడ్డి ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పిల్లలకు ఆటల్లో నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యంగా పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జెడ్పీ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు



క్రిష్టిపాడు ఎంపీయూపీ స్కూల్

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ అధికారికంగా ఉత్తర్వులు వచ్చినట్లు మండల విద్యాధికారి మనోహర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలో మ్యాథ్స్, సోషల్, హిందీ, తెలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయన్నారు. కొత్తగా ఎస్ఎస్, పీఎస్, ఇంగ్లిషు పోస్టులు వచ్చినట్లు చెప్పారు. దీంతో మండలంలో ప్రస్తుతం నాలుగు జెడ్పీహెచ్ఎస్, ఒక కస్తూరిబా స్కూల్ ఉన్నట్లు చెప్పారు. గ్రామస్తులు తమ పిల్లలను సర్కారు బడికే పంపించి పాఠశాల అభివృద్ధికి దోహదపడాల

రేపు ప్రత్యేక ఆరాధన

నంద్యాల (న్యూటౌన్): పట్టణంలోని క్రాంతినగర్ సమీపంలో ఉన్న పెంతెకోస్తే చర్చి ఆధ్వర్యంలో ఈనెల 25న ప్రత్యేక ఆరాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చర్చి పాస్టర్ జాన్‌బెన్ని ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఐపీసీ చర్చి అధ్యక్షుడు పాస్టర్ భగవాన్‌దాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తారని చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల క్రైస్తవులు, పట్టణ ప్రముఖులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు..

నూతన గదుల ప్రారంభోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని వీరశైవ లింగాయత్ సత్రంలో నూతనంగా నిర్మించిన 33 గదుల సముదాయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముందుగా స్వామిఅమ్మవార్ల చిత్రపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సత్రం ద్వారా భక్తులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యులు విరూపాక్షయ్యస్వామి, వీరశైవ లింగాయత్ సత్రం అధ్యక్షుడు చిత్తరంజన్, కార్యదర్శి ఎస్. నాగరాజు, కోశాధికారి శివప్రకాష్, ఉపాధ్యక్షుడు వందనా శంకర్, తదితరులు పాల్గొన్నారు.



● ఆశల విత్తు

తొలకరి వానలు పలకరించడంతో రైతులు ఖరీఫ్‌సాగుకు శ్రీకారం చుట్టారు. తొలిపంటగా మండలంలో మినుము విస్తారంగా సాగుచేస్తున్నారు.ఇది మూడునెలల పంటే కావడంతో ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈపంట తర్వాత రెండో పంటగా వరిని సాగు చేస్తారు. కాగా ప్రస్తుతం మినుము విత్తనాలు మార్కెట్‌లో క్వింట రూ.12వేలు పలుకుతున్నాయి. అదే పంట దిగుబడిని రైతులు తీసుకెళ్తే వ్యాపారులు కేవలం రూ.7వేలకు కొనుగోలు చేస్తున్నారు. –దొర్నిపాడు



● ఆరోగ్యయోగం

'ప్రతిరోజూ అరగంట యోగా చేస్తే శరీరానికి, మనసుకి చాలా మంచిది.ఎన్నో రుగ్మతల నుంచి ఇది కాపాడుతుంద'ని అడిషనల్ ఎస్పీ చంద్రబాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పోలీస్ మైదానంలో శుక్రవారం పోలీసు సిబ్బందికి యోగా ఆవశ్యకత తెలియజేశారు. యోగాసనాలు వేయించారు. దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని అడిషనల్ ఎస్పీ సూచించారు. తాలూకా ఇన్‌స్పెక్టర్ ఈశ్వరయ్య పాల్గొన్నారు. – బొమ్మలసత్రం



● కారుమబ్బులు కమ్మేశాయి

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం పూట మాడు పగిలేలా ఎండ కాస్తుంది. ఆ తర్వాత మబ్బులు కమ్మేసి వర్షం పడుతోంది. జిల్లాలో కొద్ది రోజులుగా ఈ భిన్న వాతావరణం కనిపిస్తోంది. దొర్నిపాడు శివారులో శుక్రవారం సాయంత్రం ఓ వైపు మేఘాలు కమ్మేసి వానజల్లులు కురుస్తుంటే మరో వైపు భానుడు తొంగిచూస్తున్న దృశ్యం కనువిందు చేసింది. – దొర్నిపాడు

జీవ వైవిధ్య పోటీల్లో ప్రతిభ



మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఉప విద్యాశాఖ కార్యాలయంలో పర్యావరణ సుస్థిరాభివృద్ధి అనే అంశంపై నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్ జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, ఉప విద్యాశాఖ అధికారి శంకర్‌ప్రసాద్, డోన్ ఉప విద్యాశాఖ అధికారి వెంకటరామిరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి అభినందించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రకృతిని పరిశీలించి అవగాహన చేసుకోవాలన్నారు. భూమి మీద రకరకాల జంతువులు, మొక్కలను రక్షించి తద్వారా జీవ వైవిధ్యాన్ని పెంచాలన్నారు. ఇలా చేయడం ద్వారా మంచి గాలి, ఆహారం, తీసుకుంటూ ఆనందంగా, ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీసీ సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి, సుందర్‌రావు, ఉపాధ్యాయులు శేషఫణి పాల్గొని ప్రతిభ చాటిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లతో పాటు జ్ఞాపికలు అందజేశారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

నంద్యాల(వ్యవసాయం): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మౌలానా అబ్దుల్లా రషాదీ ఆద్ అబులైస్, సమ్మద్ డిమాండ్ చేశారు. సర్కారు తీరును నిరసిస్తూ ఈ నెల 25వ తేదీన నంద్యాల పట్టణంలో మానవహారం (హ్యూమన్ చైన్) నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం స్థానిక క్రాంతిరేఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం–2025కు వ్యతిరేకంగా ×ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు₹ వారి ఆదేశాల మేరకు ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 2.30 గంటల వరకు మానవహారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని అన్ని మసీదుల ఇమాములు, ఉలేమాలు, మసీదు పెద్దలు, రాజకీయ నాయకులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఏజాజ్, అయూబ్, మౌలానా, జుబేర్‌బాషా, హనీఫ్, అబ్దుల్‌రషీద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొట్టిన కారు



నర్సాపురం వద్ద కారును పక్కకు తోస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని నర్సాపురం వద్ద గురువారం రాత్రి ఓ కారు రోడ్డు పక్కనున్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ దిమ్మెను ఢీకొట్టింది. అయితే, కారులో ఉన్న వారికి ప్రమాదం త్రుటిలో తప్పింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కొందరు భక్తులు అహోబిలం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని కారులో ఆళ్లగడ్డ వైపు తిరిగి వెళ్తున్నారు. నర్సాపురం సమీపంలోని రవి డిగ్రీ కళాశాల వద్దకు రాగానే కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి అక్కడున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొంది. దీంతో కారు ముందు భాగం దెబ్బతినింది. ఆ వాహనంలో ఉన్న నాలుగురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. అటుగా వెళ్తున్న కొందరు గ్రామస్తులు గమనించి పరుగున అక్కడికి వెళ్లి కారును దిమ్మె నుంచి వెనక్కు తోశారు. కొద్ది సేపటికి తేరుకున్న ఆ నలుగురు అదే కారులో ఆళ్లగడ్డకు వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులను అడగ్గా ప్రమాదానికి సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

యాదగిరి నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోస్పాడు: మండలంలోని తేళ్లపురి గ్రామంలో యాదగిరి నరసింహస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడంతో ఈనెల 6, 7, 8 తేదీల్లో స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారానికి 16 రోజులు కావడంతో దేవాలయం వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. స్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం బాలకొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణను గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమంతో పాటు కోలాటం, భజన వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

బాధితులకు సత్వర న్యాయ సహాయం

- వన్‌స్టాప్ సెంటర్ సిబ్బందికి జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): హింసకు గురైన మహిళలకు వన్ స్టాప్ సెంటర్ ద్వారా న్యాయ సహాయం, కౌన్సెలింగ్ సత్వరం అందించాలని వన్‌స్టాప్ సెంటర్ అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మిషన్ శక్తి సమీకృత మహిళా సాధికారత కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవసరం ఉన్న మహిళలకు సహాయ సహకారాలు అందజేయాలన్నారు. 2024 ఆగస్టు 1న వన్ స్టాప్ సెంటర్ ప్రారంభమైందని, నాటి నుంచి ఇప్పటి వరకు 32 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా వన్ స్టాప్ సెంటర్‌లో ఆశ్రయం పొందిన మహిళలు కౌన్సెలింగ్ పొందిన అనంతరం స్వస్థలాల్లో వారు ఎలా ఉన్నారో ఆరా తీయాలన్నారు. కలెక్టరేట్‌లో కూడా మహిళలు అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లతో పాటు వన్‌స్టాప్ సెంటర్ చిరునామా, సీసీఏ నెంబర్లు కూడా ఏర్పాటు చేయాలని వన్ స్టాప్ సెంటర్ సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా విద్యార్థి దశలోనే పిల్లలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలను నియంత్రించడానికి పెళ్లిల సమయంలో వివాహ వేదిక బుక్ చేసుకునే సమయంలో వధువు, వరుడి పుట్టిన తేదీలను పరిశీలించాలన్నారు. అదే విధంగా వన్ స్టాప్ సెంటర్‌లో సైకో సోషల్ కౌన్సిలర్ పోస్టును భర్తీ చేసేలా ఫైల్ ప్రాసెస్ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలో స్వీయ రక్షణ కోర్సులను జూన్‌లో ప్రారంభించి సెప్టెంబరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థినులు, మహిళలు వారి మొబైల్‌ఫోన్‌లలో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. శక్తి యాప్ ఆవశ్యకతను వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది శక్తి టీమ్ ద్వారా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఐసీడీఎస్ పీడీ తేజేశ్వరి, డీఈఓ జనార్దన్ రెడ్డి, ఐటీడీఏ పీఓ వెంకట శివ ప్రసాద్, యువజన సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదాబేగం, జిల్లా ఖజానా శాఖ అధికారి లక్ష్మీదేవి, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహాపర్వీన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లలో మెరుగైన వసతులు కల్పించండి

జిల్లా పరిధిలోని ఏడు ఆర్టీసీ బస్టాండ్‌లలో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి డిపో మేనేజర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన చాంబర్ నుంచి ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్లతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బస్టాండ్లలో వసతుల కల్పనపై సమీక్షించారు. ప్రతి బస్టాండ్‌లో శుభ్రతతో పాటు తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నిరుపయోగంగా ఉన్న వ్యక్తిగత మరుగుదొడ్లను వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. సమావేశంలో నంద్యాల ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రజియా సుల్తానా, డిపో అధికారి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు తప్పనిసరి

గోస్పాడు: రహదారి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని లేకపోతే చర్యలు తప్పవని ఎస్ఐ సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పోలీసులతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలు వాహన డ్రైవర్లకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. కెపాసిటీకి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. అలాగే వాహనాలు నడిపే సమయంలో మత్తు పదార్థాలు తీసుకోరాదన్నారు. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

గోస్పాడు: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్ ఏఈ జ్ఞానసూర్యుడు అన్నారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో శుక్రవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో విద్యుత్ వినియోగదారులు క్రమం తప్పకుండా విద్యుత్ బిల్లులు చెల్లించి సిబ్బందికి సహకరించాలన్నారు. గ్రామాల్లో ఎప్పుడు ఏ విద్యుత్ సమస్య తలెత్తినా ప్రజలకు అందుబాటులలో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. వర్షాలు పడుతున్నందున విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

ఉయ్యాలవాడ : ప్రతి రోజు యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చునని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో 20 మంది శిక్షణ నిపుణులను తయారు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. వీరి ద్వారా మండలంలోని 7,200 మందికి యోగాపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. శిక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యూర్ స్కానర్ ద్వారా నమోదు చేసుకోసునేలా సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న వృషభాలు

ఓర్వకల్లు : మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలు హోరాహోరీగా సాగాయి. హనుమజ్జయింతి సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో మొత్తం 13 జతల ఎద్దులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలలో నాగర్‌కర్నూలు జిల్లా, లింగాల మండలం, రాయవరం అక్షరారెడ్డి వృషభాలు తొలి బహుమతి రూ.60 వేలను కైవసం చేసుకోగా, కర్నూలు మండలం, బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన ఆకెపోగు చిన్నరత్నం వృషభాలు రెండవ బహుమతి రూ.40 వేలను దక్కించుకున్నాయి. కోడుమూరు మండలం, వెంకటగిరికి చెందిన శశాంక్, శ్రేయ వృషభాలు మూడవ బహుమతి రూ.30 వేలు, గద్వాల జిల్లా, ఉండవల్లి మండలం, కంచుపాడుకు చెందిన అంజిరెడ్డి వృషభాలు నాల్గవ బహుమతి రూ.20 వేలను సాధించుకున్నాయి. బనగానపల్లె మండలం, రామతీర్థం నాగపుల్లయ్య, నంద్యాల జిల్లా, దొర్నిపాడుకు చెందిన కిట్టన్న (విడి జత) వృషభాలు ఐదవ బహుమతి 15 వేలు, కర్నూలు మండలం, పసుపుల శేఖర్, నంద్యాల జిల్లా, కొణిదేలకు చెందిన దండు రైడర్స్(విడిజత) వృషభాలు ఆరవ బహుమతి రూ.10 వేలు, కోడుమూరు మండలం, వెంకటగిరికి చెందిన బీఎల్‌కే వృషభాలు ఆరవ బహుమతి రూ.5 వేలు గెలుచుకున్నాయి. పోటీలకు వాడాల రామనాయుడు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ఎంఓడీఎస్‌కు గురైన బాలికకు మెరుగైన వైద్యం

కర్నూలు(హాస్పిటల్): మల్టీ ఆర్గాన్ డిస్‌ఫంక్షన్ సిండ్రోమ్(ఎంఓడీఎస్)కు గురైన బాలికకు మెరుగైన వైద్యం అందించిన ప్రాణంపోసినట్లు కర్నూలులోని కిమ్స్ కడల్స్ హాస్పిటల్‌కు చెందిన పీడియాట్రిషన్ డాక్టర్ నవీన్‌రెడ్డి చెప్పారు. ఆయన శుక్రవారం చికిత్స వివరాలు వెల్లడించారు.అనంతపురం జిల్లా గుంతకల్లు ప్రాంతానికి చెందిన 14ఏళ్ల బాలికకు ముందుగా జ్వరం, దగ్గు, కడుపునొప్పి మొదలయ్యాయని, రెండోరోజే ఆమె పరిస్థితి విషమించిందన్నారు. ఆమెను స్థానికంగా ఒక ఆసుపత్రికి తీసుకెళ్లగా బీపీ(60/30) పూర్తిగా పడిపోయిందని గుర్తించి అక్కడి వైద్యులు కర్నూలు కిమ్స్‌కు రెఫర్ చేశారన్నారు. బాలికను ఆసుపత్రికి తీసుకొచ్చే నాటికే బహుళ అవయవాలు విఫలమై తీవ్ర ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిపోయిందన్నారు. ఇన్‌ఫెక్షన్ వల్ల ఇలాంటి పరిస్థితి వస్తుందని చెప్పారు. ఆ బాలికను వెంటిలేటర్‌పై ఉంచి అవసరమైన చికిత్స అందించామన్నారు. కంటిన్యూస్ కిడ్నీ రీప్లేస్‌మెంట్ థెరపీ, వైద్యచికిత్సలతో బాలిక కోలుకుందని చెప్పారు.

ప్రభుత్వ నిర్ణయంతో జీవనోపాధి దూరం




కాటసాని రాంభూపాల్‌రెడ్డికి వినతి పత్రమిస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

కల్లూరు: ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం వల్ల ఆపరేటర్లు, హెల్పర్లు జీవనోపాధి కోల్పోతారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాలకు చెందిన ఎండీయూ ఆపరేటర్లు కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. తమ పోరాటానికి మద్దతు తెలపాలని, తమకు అండగా నిలవాలని కోరారు. కాటసాని మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఇంటి ముంగిటకే రేషన్ సరుకులు అందించాలని ఉద్దేశంతో ఎండీయూ వాహనాలు తీసుకువచ్చిందన్నారు. ఈ వ్యవస్థను ఏర్పాటు చేసి రాష్ట్రంలో ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిందన్నారు. దీనిని ప్రభుత్వం రద్దు చేయడం సరైందికాదన్నారు.

నకిలీ మ్యాంగోస్

- ● బేనిషా పేరుతో ఇతర రకం విక్రయాలు
- ● మోసపోతున్న వినియోగదారులు





దుకాణంలో బంగినపల్లె మామిడి పేరుతో ఉంచిన ఇతర మామిడి పండ్లు

బనగానపల్లె: బంగినపల్లి బేనిషా మామిడి పండ్లకు ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు ఉన్న విషయం విదితమే. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఎంతో ఇష్టంగా ఈ మామిడి పండ్లను ఆరగిస్తారు. కొనుగోలు సమయంలో అప్పటి పరిస్థితులు, డిమాండ్‌ను బట్టి శక్తి మేరకు కొనుగోలు చేస్తారు. బనగానపల్లె ప్రాంతంలో కొన్ని చోట్ల మాత్రమే మామిడి తోటలు ఉండగా బంగినపల్లి బేనిషా మామిడికి ఉన్న డిమాండ్‌ను ఆసరాగా తీసుకుని కొందరు వ్యాపారులు బేతంచర్ల మండలంలోని యంబాయి, డోన్, ప్యాపిలి, పాణ్యం తదితర ప్రాంతాల నుంచి మామిడి పండ్లను తీసుకొచ్చి బంగినపల్లి పేరుతో విక్రయాలు సాగిస్తున్నారు. గత ఏడాది వంద మామిడి పండ్లు రూ.4–5 వేలు విక్రయించగా ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా లేవని రూ.5–6 వేలు విక్రయిస్తున్నారు. ఈ మామిడి కాయలు చూసేందుకు అచ్చం బంగినపల్లిని పోలి ఉండడంతో వినియోగదారులు గుర్తించలేకపోతున్నారు. బంగినపల్లి బేనిషా మామిడి తోలు పలుచగా ఉండి, విత్తనం వరకు తీపిగా ఉంటుంది. మాగిన తరువాత 10 రోజుల వరకు చెడిపోదు. ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన మామిడి పండ్లు తోలు మందంగా ఉండి విత్తనం వద్ద పుల్లగా ఉంటుంది. రెండు మూడు రోజుల్లోనే చెడిపోతుంది. వీటి విక్రయాలు బనగానపల్లె పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. కొన్నేళ్లుగా బంగినపల్లి మామిడి దిగుబడులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వాతావరణం అనుకూలించగా దిగుబడి తక్కువగా ఉంటోంది. వీటిని ఎక్కువగా ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. వినియోగదారులకు అవసరమైన మేర బేనిషా మామిడి అందుబాటులో లేనందున వీటి పేరుతో ఇతర రకం మామిడి పండ్లను విక్రయించేస్తున్నారు.

నవాబుల పాలనలో విస్తారంగా తోటలు

బనగానపల్లె సంస్థానాన్ని నవాబులు పరిపాలించిన కాలంలో బనగానపల్లె ప్రాంతంలో మామిడితోటల పెంపకానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఇక్కడి భూములు మామిడితోటల పెంపకానికి అనువుగా ఉన్నందున ఎక్కువ విస్తీర్ణంలో మామిడి తోటలను ఏర్పాటు చేశారు. వీటి పెంపకానికి ప్రత్యేకంగా బావులను తవ్వించి తోటమాలులను నియమించారు. ప్రస్తుతం బనగానపల్లె పరిసర ప్రాంతాల్లో మామిడి తోటల విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. నవాబుల కాలంలో సుమారు 1200 నుంచి 1500 ఎకరాల్లో మామిడితోటలు ఉండగా నేడు ఈ 150–200 ఎకరాలకు పడిపోయింది.

ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం



బనగానపల్లె బేనిషా మామిడి పండ్ల పేరుతో ఇతర మామిడి పండ్లను విక్రయించినట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన మామిడి పండ్లను విక్రయించుకోవచ్చు. అయితే వినియోగదారులను మోసం చేసి విక్రయాలు జరపడం సరికాదు. –సతీష్‌కుమార్‌రెడ్డి, ఈఓ, బనగానపల్లె

నూతన భవనంలోకి రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని మార్చాలి



వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): డోన్ పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని షాదీఖానా పక్కన ఉన్న నూతన భవనంలోకి మార్చాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ పీవీఎస్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ రూ.కోటికి పైగా ప్రభుత్వ నిధులతో భవనం నిర్మించారని, రాజకీయ విభేదాల వల్ల భవనం ప్రారంభించలేదన్నారు. ప్రజలకు ఉపయోగకరంగా ఉండే చోటనే భవనాన్ని మార్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా అధికారులతో మాట్లాడి చర్చించి అందరికీ అనుకూలం ఉన్న చోటనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసులు, సీపీఐ కార్యదర్శి మోటరాముడు, కరీం, తదితరులు పాల్గొన్నారు.